విరిగిన స్తంభాలు..
కరెంటు కోతలు

- చిన్నపాటి చినుకులకే విద్యుత్ కోత
- గాలీవానకు నేలకొరుగుతున్న స్తంభాలు
- పునరుద్ధరించడంలో జాప్యం
- అంధకారంలో గ్రామాలు, తాగునీటికి ఇక్కట్లు
- ఇబ్బందులు పడుతున్న పల్లెప్రజలు



గోనెగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్



నేలకొరిగిన విద్యుత్ స్తంభం (ఫైల్)

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా విద్యుత్ కోతలు తీవ్ర మవుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ అధికారులు కోతలను విధిస్తున్నారు. దీనికి తోడు గత వారం రోజులుగా అడప దడపా వర్షాలు కురుస్తుండడం , ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతుండడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో సరఫరా పునరుద్ధరించడంలో జాప్యం జరుగుతోంది.

అసలే మండు వేసవి కావడంతో ప్రజలు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. అలాగే గ్రామాల్లోని తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం కారణంగా గ్రామాల్లో కుళాయిలకు తాగునీరు సరఫరా కాక నీటి సమస్యలు తలెత్తుతున్నాయి.

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే..

మండలంలోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే విషయంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం కారణంగానే స్తంభాలు నేలకొరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. అలాగే గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల్లో అలసత్వం

ఇటీవల ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, నెరుడుప్పల, గోనెగండ్ల, హెచ్. కై రవాడి తదితర గ్రామాల్లో వర్షం, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపుల కారణంగా దాదాపు 20 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే 50 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం కాలిపోయాయి. వీటి మరమ్మతులు చేసేందుకు సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో గత కొద్ది రోజులుగా కరెంట్ సక్రమంగా ఉండడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. చిన్న చినుకులు పడినా రాత్రి పగలు తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ తీస్తున్నారు. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.కరెంట్ కోతలు విధించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. – భూమమ్మ, పెద్దమరివీడు గ్రామం

మరమ్మతు పనులు చేస్తున్నాం

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులకు మండలంలోని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే ట్రాన్స్‌ఫర్మార్లు కాలిపోయాయి. వాటి మరమ్మతు పనులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మండలంలోని విద్యుత్ సిబ్బంది అందరం వారం రోజులుగా విద్యుత్ మరమ్మతు పనుల్లో నిమగ్నమైవున్నాం. వినియోగదారులు కూడా దీనికి సహకరించాలి.

– సుధాకర్ రావు, విద్యుత్ ఏఈ, గోనెగండ్ల

క్లుప్తంగా

గుంటిరంగస్వామి సన్నిధిలో..



మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : మహిమాన్విత దైవం గుంటిరంగస్వామి దర్శనార్థం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మిగనూరు మండలం వెంకటాపురం గ్రామం వచ్చారు. శుక్రవారం వెంకటాపురం చేరుకుని గుంటి రంగస్వామికి అర్చనలు, హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం అక్కడే జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే



నూతన వధూవరులతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు జే.కె.ఈరన్న కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. వధువరూలకు అక్షింతలు వేసి వారి ఆశీర్వదించారు. ఇందులో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో బేస్తా గోవిందు కుమారుడి వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొని వధువరులను ఆశీర్వాదించారు. అలాగే మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కౌతాళం ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, మండల యువజన అధ్యక్షుడు తాహెర్, సోషల్ మీడియా కన్వీనర్ ఖాదర్‌లింగ పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన



యోగాంధ్ర సమీక్షలో అధికారులు

మంత్రాలయం : ప్రభుత్వం ఈనెల 21 నుంచి నెల రోజులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పీఈటీలు రోజూ గంటపాటు ఆసక్తి ఉన్నవారికి యోగా క్లాసులు చేపట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి యోగా ఆసక్తి ఉన్న వారిని యాప్‌లో ఎంపిక చేయాలన్నారు. సమీక్షలో ఎంపీడీఓ నూర్జహాన్, తహసీల్దార్ ఎస్.రవి, ఎంఈఓ రాఘన్న, పీఆర్ ఏఈ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



గోనెగండ్లలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పైపులైన్ పనులను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోనెగండ్లకు జలజీవన్ మిషన్ కింద రూ.2.50కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నాయి. అలాగే నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి పైపులైన్లు వేసి ప్రతి ఇంటికి కుళాయిలను వేయడం జరుగుతుందన్నారు. దీంతో గోనెగండ్లకు త్వరలో తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ ఈఓ సతీష్, సిబ్బంది చంద్రశేఖర్, మలాంగ్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సమస్య పరిష్కారం



స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల విజయోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యల సాధనకై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల వల్లే కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యాయని అసోసియేషన్ రీజనల్ సహాయకార్యదర్శి ఎన్ పీఎం సాహెబ్, డిపో కార్యదర్శి ముస్తాక్ అహమ్మద్‌లు అన్నారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై ధర్నాలు చేపట్టడంతో.. ఆర్టీసీ ఈడీలతో జరిగిన చర్చల్లో జనవరి 2019 సర్క్యులర్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. శుక్రవారం డిపో ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగ,కార్మికులు విజయోత్సవ వేడుకను నిర్వహించారు.

1 నుంచి డీలర్ షాపు నుంచే రేషన్

మంత్రాలయం : వచ్చే నెల 1వ తేదీ నుంచి డీలర్ల షాపుల నుంచి రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎస్.రవి సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి డీలర్ అందుబాటులో ఉండి రేషన్ సరుకులు అందజేయాలని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ ఇళ్ల వద్దకే వెళ్లి ఐదు రోజులు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు తూచా పాటించాలని కోరారు. ఇక నుంచి ఎండీయూ వాహనాలు అందుబాటులో ఉండవని వ్యక్తం చేశారు. సమావేశంలో డీటీ శశి శేఖర్, ఆర్ఐ ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

నందవరం: పేదలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను తొలగించదని, ఇంటింటికి ప్రజా పంపిణీ రద్దు చేసిందని వివరించారు. వచ్చే నెల జూన్1వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు డీలర్లు షాపు వద్దనే రేషన్ అందిస్తారని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీల్లర్లు రేషన్ పంపిణీల్లో అవకతవకలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రతి డీలర్ రేషన్ పంపిణీ 90 శాతం పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎస్‌డీటీ మహేష్, డీలర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్

పెద్దకడబూరు : 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులను డీలర్లు ఇంటిదగ్గరకే పంపిణీ చేస్తారని తహసీల్దారు గీతాప్రియదర్శిని అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జూన్ 1నుంచి ఎండీయూ ఆపరేటర్ల సేవలు నిలిపివేయడం జరిగిందన్నారు. దీనివల్ల రేషన్ సరుకులను రేషన్ దుకాణాల దగ్గరకు వెళ్లి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రేషన్ షాపులు 1వ తేదీ నుంచి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచుతారని తెలిపారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ సుధాకర్‌బాబు

ఆదోని సెంట్రల్: వాల్మీకి విద్యార్థులకు శ్రీమహర్షి వాల్మీకి ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ సుధాకర్‌బాబు, గౌరవ సలహాదారుడు నరసయ్య, ఉపాధ్యక్షుడు వాల్మీకి రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పురపాలక ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈనెల 25వ తేదీన ఎమ్మిగనూరు పట్టణంలోని పోస్టు ఆఫీసు ఎదురుగా ఉన్న శ్రీ మహర్షి వాల్మీకి కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 24వ తేదీ లోగా తమ పేర్లను మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాన్ని 70136 82489, 96407 18346 నంబర్‌లకు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు.

25న ప్రతిభా పురస్కారాల ప్రదానం

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 25న పట్టణంలోని జిల్లా వ్యాప్తంగా పదవ తరగతిలో పరీక్షల్లో ప్రతిభ చూపిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి ఉద్యోగ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఉసేని తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి కమ్యునిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వాల్మీకి ఉద్యోగ సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, తిమ్మారెడ్డి,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

ఆదోని రూరల్: మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, డివిజన్ కార్యదర్శి జి.వెంకప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో వారు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో 27 మంది ఆదివాసీలను అత్యంత కిరాతకంగా బూటకపు ఎన్‌కౌంటర్‌తో హత్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న దండకారణ్యంలో అపార ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పడానికి ఆపరేషన్ కగార్‌ను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సౌరప్ప, ఐఎఫ్‌టీయూ మండల నాయకులు కుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ పాలక వర్గ ఎన్నికలు నిర్వహించాలి



వినతి పత్రాలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పాలకవర్గానికి ఎన్నికలు తక్షణం నిర్వహించాలని మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌తో పాటు సహకార సంఘాల రిజిస్ట్రార్, జిల్లా సహకార శాఖ అధికారికి వినతి పత్రాలను పంపారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం పాలకవర్గ పదవీకాలం ఐదేళ్లకు మించరాదని తెలిపారు. ఈ ప్రకారం ఎన్నికలు నిర్వహించకపోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈటౌన్ బ్యాంక్‌లో 30 సంవత్సరాల క్రితం పాలకవర్గ ఎన్నిక నిర్వహించారని గుర్తు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేసినా పలు కారణాల వల్ల జరగలేదన్నారు. దీంతో బ్యాంక్ ఖాతాదారుల్లో నమ్మకం సన్నగిల్లిందని తెలిపారు.

ప్రస్తుత పాలకవర్గంపై ఆరోపణలు

ప్రస్తుత పాలకవర్గం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. బ్యాంక్ ఖాతాదారులపై బ్యాంక్ చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి అనుచితంగా మాట్లాడుతున్నారని ఓ ఖాతాదారుడు ఇటీవల ఆరోపించడం తెలిసిందేనన్నారు. అదేవిధంగా ఓ డైరెక్టర్ తన భార్యను లీగల్ అడ్వైజర్ నియమించుకోవడం, రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో ఎన్‌పీఏలుగా మారాయని, అటువంటి వారిని డైరెక్టర్‌గా నామినేట్ చేయడం నిబంధనల మేరకు చట్ట విరుద్ధమని చెప్పారు. అంతేకాకుండా సీఎం చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా బ్యాంక్ నిబంధనలకు విరుద్ధగా కొన్ని పత్రికల్లో అడ్వటైజ్‌మెంట్లు ఇవ్వడంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు అయ్యిందని తెలిపారు. అందువలన ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అర్బన్ నోడల్ ఆఫీసర్ రమణారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పెండింగ్‌లో వున్న ఇళ్ల నిర్మాణాలని సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అర్బన్ నోడల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డితో కలిసి జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వీసులు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, గృహనిర్మాణ శాఖ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా వున్న నిర్మాణాలను ఈనెల 30వ తేదీలోగా పూర్తయ్యేలా లబ్ధిదారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర పనులు సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ నీరజ, విక్టర్, రాజునాయక్, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈలు మదన్‌కుమార్, ఇన్‌చార్జ్ మేనేజర్ అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు



పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు

కోసిగి: మండల పరిధిలోని దొడ్డి గ్రామంలో ప్రధాన రోడ్డుపై ప్రాథమిక పాఠశాల ఎదురుగానే మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ రోడ్డు వెంబడి చిన్నభూంపల్లి, పెద్ద భూంపల్లి గ్రామాలకు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అనునిత్యం తిరుగుతుంటాయి. చాల రోజులుగా ఇళ్లలోని డ్రైనేజీ నీరు రోడ్డు పైకి వచ్చి చేరుతూ ఎటూ వెళ్లలేక అక్కడి నిలుస్తూ కంపుకొడుతోంది. మురుగు నీళ్లలో నుంచి ప్రయాణం చేయలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ఆదమరిచి ప్రయాణిస్తే కింద పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరారు.

పన్నులకు సంబంధించి సర్వే చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో ఉన్న ఇంటి పన్నుల సవరణలు, ఏ ఇంటికైనా లేదా స్థలానికైనా పన్ను విధించకుండా ఉంటే పన్ను విధించాలని ఆదేశించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నా క్యాంటీన్‌ల పరిశీలన

పట్టణంలోని పాత బస్టాండ్, మాతాశిశు ఆసుపత్రి వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం పేదలకు వడ్డించే అల్పాహారం నాణ్యతపై పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో వడ్డించే అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

డీలర్లతో సమావేశం

ఆదోని రూరల్: స్థానిక రెవెన్యూ భవన్‌లో శుక్రవారం సాయంత్రం మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ శివరాముడు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్‌కార్డుదారులకు రేషన్‌షాపుల ద్వారానే నిత్యావసర సరుకులను అందించాలన్నారు. ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఈ విషయాన్ని కార్డుదారులకు తెలియజేయాలన్నారు. ప్రతినెలా రేషన్‌షాపులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ వలీబాషా, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ పాయింట్లను నిబంధనల మేరకు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయ బదిలీల్లో ఉపాధ్యాయులకు రెండు క్యాడర్ల సర్వీస్ పాయింట్లను నిబంధనల మేరకు కేటాయించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర నాయకులు గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌జీటీగా నియామకమైన తరువాత మళ్లీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికై.. ఆ మేరకు పని చేస్తూ బదిలీల్లో భాగంగా దరఖాస్తు చేస్తే కేవలం స్కూల్ అసిస్టెంట్ సర్వీస్ పాయింట్లు మాత్రం కేటాయించడం సమంజసం కాదన్నారు. సమావేశంలో డీటీఎఫ్ నాయకులు పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, వెంకటేషప్ప, జగదీష్, మజహర్‌బాషా, బండెనవాజ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంవీఐపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: ఈనెల 22న వాహనాలను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అవేష్‌పై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కర్ణాటక జిల్లా కోలార్‌కు చెందిన అడ్వకేట్ చంద్రప్పపై కేసు నమోదు చేసి, శుక్రవారం అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు విలేకరులకు తెలిపారు. మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అవేష్ కర్ణాటకకు చెందిన న్యాయవాది చంద్రప్ప ప్రయాణిస్తున్న మినీ ట్రావెల్‌ను ఆపి తనిఖీ చేయగా అతను దుర్భాషలాడుతూ దాడి చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారించి, చంద్రప్పను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఉరుకుందలో కోనేరు నిర్మాణం



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి పుణ్యక్షేత్రంలో కోనేరు నిర్మాణానికి దాత మంజునాథ్‌తో కలిసి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కోనేరు నిర్మాణానికి బెంగళూరుకు చెందిన ఈరన్నస్వామి భక్తుడు మంజునాథ్ రూ.కోటి 80లక్షలు ఇవ్వడానికి ముందుకు రావడంతో భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చేశారు. పుణ్యక్షేత్రం వద్ద భక్తులకు కోనేరు లేకపోవడంతో దాతగా మంజునాథ్ ముందుకు వచ్చారు. భక్తులు ఎన్నోసంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న కల నెరవేరుతున్నదన్నారు. భక్తుల కోసం ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులను చేపడుతామని, అభివృద్ధిలో దాతల సహకారం ఎంతగానో ఉండాలన్నారు. కార్యక్రమంలో వేద పండితులు మురళీకృష్ణశర్మ, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, మహదేవస్వామి, ముఖ్య అర్చకులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఖాకీ డ్రెస్ వేసుకొని డ్రైవింగ్ చేస్తే మీలో బాధ్యత పెరుగుతుందని, గౌరవంగా ఉంటుందనే విషయాన్ని డ్రైవర్లు గుర్తించుకోవాలని తెలిపారు. ఆటోలకు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు అతికించి, దారాలు చుడుతున్నారని, ఆటో నంబర్ కనిపించేలా ఉండాలని చెప్పారు. ఆటో డ్రైవర్లు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సును తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.

కోర్టు ఉత్తర్వులా.. అయితే ఏంటి?

- టీడీపీ నాయకుల ప్రోద్బలంతో వక్ఫ్‌బోర్డు స్థలంలో భవన నిర్మాణం
- ఆపివేయాలని హైకోర్టు కోర్టు ఉత్తర్వులు
- అయినా పట్టించుకోని అక్రమార్కులు



వక్ఫ్‌బోర్డు స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న భవనం

ఆదోని రూరల్: ఎక్కడైనా ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు పాగా వేసి రాత్రికి రాత్రే భవనాలు కట్టేస్తున్నారు అక్రమార్కులు. వారికి కూటమి నేతల అండదండలుండటంతో ప్రభుత్వ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో కోట్లాది రూపాయల విలువ చేసే వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మాణాన్ని ఆపివేయాలని సాక్షాత్తు హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా.. పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారు.

సాతుబీ దర్గా స్థలంలో షాపుల నిర్మాణం..

ఆదోని నడిబొడ్డున ఆర్ట్స్ కళాశాల వద్దనున్న సాతుబీ దర్గాకు సర్వే నంబర్ 259ఏలో 3.97 సెంట్లు వక్ఫ్‌బోర్డుకు చెందిన స్థలం ఉంది. ఈ సర్వే నంబర్‌లో ఎలాంటి నిర్మాణాలు, అమ్మకాలు కొనుగోలు చేపట్టరాదని ఓఎస్ నంబర్ 118/1999 రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యూనల్ ఉత్తర్వులు ఉన్నాయి. అయినా కొంతమంది అక్రమార్కులు కోర్టు ఉత్తర్వులను బేఖాతార్ చేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. జుమ్మాపేట ముక్తార్‌అహ్మద్ అనే వ్యక్తి వక్ఫ్‌బోర్డు స్థలం అని తెలిసినా కొనుగోలు చేసి టీడీపీ నాయకుల ప్రోత్బలంతో అక్రమంగా నిర్మాణాలు చేపట్టాడు. గతంలో వక్ఫ్ అధికారులు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని జుమ్మాపేట ముక్తార్‌అహ్మద్‌కు నోటీసులు ఇచ్చినా ఇటు టీడీపీ రాజకీయ నాయకులను, అటు అధికారులను మేనేజ్ చేస్తూ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. దీంతో దర్గా ముత్తావల్లి సయ్యద్ మహబూబ్‌బాషా హుస్సేని అక్రమ నిర్మాణం ఆపాలంటూ హైకోర్టులో కేసు (డబ్ల్యూపీ. నంబర్ 9779/2025) వేయడంతో.. హైకోర్టు వారు తక్షణమే అక్రమ నిర్మాణం ఆపాలని జుమ్మాపేట ముక్తార్‌అహ్మద్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో 13-05-2025న ఆదోని పురపాలక సంఘం అధికారులు జుమ్మాపేట ముక్తార్‌అహ్మద్‌కు నోటీసులు అందజేసి తక్షణమే నిర్మాణం ఆపాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు.

పలుమార్లు ఫిర్యాదు చేశాం



ఇదీ సాతుబీ దర్గాకు చెందిన వక్ఫ్ స్థలం. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని కోర్టు తీర్పు ఉన్నప్పటికీ జుమ్మాపేట ముక్తార్ అహ్మద్ వాటిని ఉల్లంఘిస్తూ అక్రమంగా నిర్మాణం చేస్తున్నాడు. దీనిపై గతంలో పోలీసులకు, వక్ఫ్ అధికారులకు, సబ్‌కలెక్టర్ వారికి ఫిర్యాదు చేశా. అయినా నిర్మాణం ఆగలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించాను. ఇప్పటికైనా నిర్మాణం ఆగుతుందో లేదో చూడాలి.

– సయ్యద్ మహబూబ్‌బాషా హుస్సేని, ముతవల్లి, సాతుబీ దర్గా